సాక్షి
శ్రీకాకుళం

గురువారం । 11 । జనవరి । 2024



తండ్రీ కొడుకుల డబుల్ గేమ్

ఎచ్చెర్ల టీడీపీలో రచ్చ మొదలైంది. కలిశెట్టిని చంద్రబాబు, కళాను లోకేష్ ప్రోత్సహించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

- 8లో



అర్ధరాత్రి దొంగలు పడ్డారు..!

జిల్లా కేంద్రంలో దొంగలు పడ్డారు. ఓ ఇంట్లో ఎనిమిది తులాలకుపైగా బంగారు ఆభరణాలు పట్టుకుపోయారు.

- 8లో

ఈసీసీఈ కోర్సులో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వర్సిటీ వెబ్‌సైట్ బీఆర్ఏయూ.ఈడీయూ.ఇన్‌లో పూర్తి వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రూ.150 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్వ ప్రాథమిక విద్య లక్ష్యంగా ఈ కోర్సు డిజైన్ చేసినట్లు వివరించారు.

కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆస్పత్రి



వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు



నిర్మాణంలో మూలపేట పోర్టు



• ఉద్దానానికి ఊపిరి

కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రబలుతున్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అండగా నిలిచారు. పలాసలో రూ.50 కోట్లకు పైగా వ్యయంతో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కిడ్నీ వ్యాధుల రీసెర్చ్ సెంటర్, అతిపెద్ద డయాలసిస్ సెంటర్ నిర్మించారు. కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరుగా భావిస్తున్న నేపథ్యంలో జిల్లాలో పలాస, ఇచ్ఛాపురం పరిధిలో 7 (ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు) మండలాల్లోని 807గ్రామాలకు ఉపరితల రక్షిత మంచినీరు అందించేందుకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. సుమారు 5లక్షల 57వేల 633మందికి తాగునీరు అందించడమే ప్రాజెక్టు లక్ష్యం.

• వలసలకు స్వస్తి

మత్స్యకార సమస్యలతో పాటు వలసలపై సీఎం ప్రత్యేక దృష్టిసారించారు. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70 కోట్లతో మూలపేట పోర్టు నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25 వేల మందికి ఉపాధి లభిస్తుంది. మత్స్యకారుల కోసం రూ.365.81కోట్లతో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.11.95 కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు.

వెనుకబాటు వీడి ప్రగతిబాటలో సిక్కోలు



వజ్రపుకొత్తూరు-కాశీబుగ్గ డబుల్ రోడ్డు

సిక్కోలు అంటే వెనుకబాటు..
సిక్కోలు అంటే వలసలు..
సిక్కోలు అంటే కిడ్నీ సమస్య..
సిక్కోలు అంటే ఉపాధి గోస.. ఇదంతా నిజమే గానీ.. ఇప్పుడది గతం.

ఆ చేదు అనుభవాల పునాదులపై ప్రగతి పూలు పూస్తున్నాయి. నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో జరిగిన అధికార మార్పిడి వెనుకబడిన, చిన్న చూపునకు గురైన శ్రీకాకుళం జిల్లా నెత్తిన పాలు పోసింది. వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి జిల్లా ప్రగతి చిత్రాన్ని తీర్చిదిద్దుతోంది. సంక్షేమ పథకాల రూపంలోనే అక్షరాలా రూ.15 వేల కోట్లు జిల్లాలోని పేద లబ్ధిదారులకు నేరుగా అందించిన ప్రభుత్వం.. జిల్లా ప్రజల అర్ధ శతాబ్ది కోరిక అయిన పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగిస్తూ ఉందిలే మంచి కాలం ముందూ ముందునా.. అంటూ.. జిల్లా భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చేస్తోంది. దీనికి తోడు రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు రానున్నాయి. ఇక దశాబ్దాలుగా జిల్లాలోని ఉద్దానం ప్రాంతాన్ని పీల్చి పిప్పి చేస్తున్న కిడ్నీ సమస్యకు శాశ్వతంగా పారదోలేందుకు ప్రత్యేకంగా రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి, 800 గ్రామాలకు ప్రత్యేక తాగునీటి పథకం ఏర్పాటు చేయడం ద్వారా ఉద్దానం గుండెలపై కుంపటిని దింపేసినట్లు అయ్యింది. మరోవైపు ఆఫ్ షోర్, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల ద్వారా వ్యవసాయానికి కొత్త ఊపిరులూదుతున్నారు.

- సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

• ప్రగతి దారి

జిల్లాలో నాలుగేళ్లలో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రూ.526. 69కోట్లతో 633.4 కిలోమీటర్లకు సంబంధించి 432 రోడ్లు మంజూరు చేసింది.

- పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఏఐబీ కింద రూ.352.78 కోట్లతో 484.43కిలోమీటర్ల మేర 312 రోడ్లు వేసేందుకు మంజూరు చేసింది. ఇందులో 266 రోడ్లు పనులు జరుగుతున్నాయి. అదే స్కీమ్‌లో కొత్తగా రూ.46.72 కోట్లతో 205.68 కిలోమీటర్లతో 83 రహదారులు మంజూరు చేసింది.
- ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ కింద రూ.70.96 కోట్లతో 94.30 కిలోమీటర్లకు సంబంధించి 23 రోడ్లు మంజూరు చేయగా వాటిలో రూ.55.55 కోట్లతో 21 రహదారుల నిర్మాణం పూర్తి చేసింది.
- పీఎంజీఎస్‌వై బ్యాచ్-1 కింద రూ.51.27కోట్లతో 11పనులు మంజూరు చేయగా ఇప్పటికే 10 పనులు పూర్తి చేసింది. బ్యాచ్-2లో రూ.38.23కోట్లతో 8పనులు మంజూరు చేయగా ఆరుపూర్తయ్యాయి. రెండు ప్రగతిలో ఉన్నాయి.
- ప్రత్యేక మరమ్మతుల కింద 275 కిలోమీటర్ల పొడవునా రూ.73.25 కోట్లతో 54 రోడ్ల పనులు చేపట్టారు. ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు వర్క్స్ కింద రూ.350 కోట్లతో 480 కిలోమీటర్ల పొడవునా 312 పనులు చేపడుతున్నారు.
- ఏపీ గ్రామీణ రహదారుల రెన్యువల్ వర్క్స్ కింద రూ.50 కోట్లతో 200 కిలోమీటర్ల పొడవునా 83 పనులు చేపడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో రూ.56.35 కోట్లతో 102 గ్రామాలకు ఉపయోగపడేలా 42 సీసీ, బీటీ రోడ్లు వేశారు.
- నగరపాలక, పురపాలక సంఘాల్లో రూ.48 కోట్లతో రహదారులను అభివృద్ధి చేశారు.
- రూ.300 కోట్లతో జిల్లాలో 12 భారీ వంతెనలు నిర్మించారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణానికి రూ.87కోట్లు మంజూరు చేశారు.

- జిల్లాలో రూ.వేల కోట్లతో పనుల నిర్వహణ
- రూ.15వేల కోట్లకు పైగా సంక్షేమ పథకాలు
- ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు
- వ్యవసాయం, పారిశ్రామిక, మత్స్యకార రంగాల్లో విశేష ప్రగతి
- కొత్త ప్రాజెక్టులతో జిల్లాకు మహర్దశ





• జలయజ్ఞం..ఫలప్రదం

జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ నడుంబిగించారు. వంశధార ఫేజ్ 2లోని స్టేజ్ 2 పనులు పూర్తి చేయడమే కాకుండా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈలోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మంజూరు చేశారు. రూ.176.35 కోట్లు మంజూరు చేయడమే కాకుండా పనులు కూడా ప్రారంభించారు. నాగావళి, వంశధార నదుల అనుసంధానం పనులు పూర్తి చేస్తున్నారు. ఉద్దానంలోని మహేంద్ర తనయపై నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.852 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26.65 కోట్లు మంజూరు చేశారు.

• పుష్కలంగా తాగునీరు..

- ఇంటింటికి తాగునీరు సరఫరా చేసేందుకు జిల్లాలో మంచినీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పైపులైన్లు వేసింది. రూ.1552.36 కోట్లతో 4822 నిర్మాణాలు ప్రారంభించగా, ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. జగనన్న హౌసింగ్ కాలనీల్లో తాగునీరు అందించేందుకు 791 పనులను రూ.38.4కోట్లతో పనులు చేపడుతున్నారు.

• అందుబాటులో వైద్యం..

- సచివాలయాల్లో భాగంగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఇంటి చెంతకే వైద్యసేవలు అందుతున్నాయి.
- జిల్లాలో కొత్తగా రూరల్ ప్రాంతాల్లో 5 పీహెచ్‌సీలు, శ్రీకాకుళం, ఆమదాలవలస తదితర అర్బన్ ప్రాంతాల్లో 11 పీహెచ్‌సీలను కొత్తగా ఈ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారు. పాతపట్నంలో 50 పడకల సామాజిక ఆసుపత్రిని రూ.4.2 కోట్లు, జొన్నవలస ఆసుపత్రిని 2.45 కోట్లు, లావేరులో రూ.1.20 కోట్లు, సోంపేట సామాజిక ఆసుపత్రిని రూ.4.60 కోట్లు, బారువ సామాజిక ఆసుపత్రిని రూ. 5.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.
- నాడు నేడు కింద 83 ఆసుపత్రులను రూ.47 కోట్లతో అభివృద్ధి చేశారు. నరసన్నపేట ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు.

• విద్యాభివృద్ధికి పెద్దపీట..

- వైఎస్సార్ కలల విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీలో రూ.131కోట్లతో జీప్లస్-5 బ్లాక్‌లను మూడు నిర్మించింది. ప్రస్తుతం రూ.67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను ప్రస్తుతం నిర్మిస్తోంది. మరో రూ.133 కోట్లతో 6వేల మందికి సరిపడా వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంది.
- జిల్లాకే తలమానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో రూ.45 కోట్లతో అదనపు భవనాలు నిర్మిస్తున్నారు.
- పొందూరు, ఆమదాలవలస మండలం తొగరాంలో డిగ్రీ కళాశాలలు, పొందూరులో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ బాలురు పాఠశాల, సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల, వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల, ఆమదాలవలస మండలం తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు. ఆమదాలవలస జగ్గు శాస్త్రులపేట వద్ద క్రికెట్ స్టేడియం మంజూరు చేశారు.



ఆర్‌జీయూకేటీలో నిర్మాణంలో ఉన్న భవనాలు

• పల్లెకు కొత్తరూపు..

- పల్లెలు సరికొత్త రూపు రేఖలు సంతరించుకున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు పెద్ద ఎత్తున జరిగాయి. కళ్లెదుటే ఆస్తులు కన్పిస్తున్నాయి.
- రైతులకు సేవలందించేందుకు రూ.141.70 కోట్లతో 650 రైతు భరోసా కేంద్రాలను నిర్మిస్తున్నారు.
- గ్రామ సచివాలయాల కోసం రూ.262 కోట్లతో 654 భవనాలను నిర్మిస్తున్నారు. వీటిలో సగానికిపైగా పూర్తయ్యాయి.
- రూ.31.20 కోట్లతో వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల కోసం 195 భవనాలను నిర్మిస్తున్నారు.
- వైఎస్సార్ విలేజీ హెల్త్ క్లినిక్స్ కోసం రూ.93.62 కోట్లతో 535 భవనాలను నిర్మిస్తున్నారు. ఇందులో సగానికి పైగా పూర్తయ్యాయి.



వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులోని గ్రామ సచివాలయ భవనం

• కీలక అభివృద్ధి పనులు



- రూ.28 కోట్లతో పొందూరు రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు.
- రూ. 48 కోట్లతో అలికాం- ఆమదాలవలస మధ్యలో రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది.
- ప్రసాదం స్కీమ్ కింద శ్రీముఖలింగం టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి చేస్తున్నారు. కోట్ల రూపాయలతో అరసవిల్లి సూర్యదేవాలయం అభివృద్ధి చేస్తున్నారు.
- జిల్లాలో లక్షా 10వేల 825మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు అందజేశారు. వాటిలో మొదటి విడతగా 83,456 ఇళ్లు నిర్మాణాలు చేపడుతున్నారు.
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించే భాగంలో జిల్లాలో 27 ఫిష్ ఆంధ్ర డెలీషియస్ యూనిట్లు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు నాలుగు లైన్లకు రూ.43కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి.

నియోజకవర్గం	డీబీటీ ద్వారా అందించిన సాయం	నియోజకవర్గం	నాన్ డీబీటీ ద్వారా సాయం
ఆమదాలవలస	రూ.1259.47 కోట్లు	ఆమదాలవలస	రూ. 650కోట్లు
నరసన్నపేట	రూ. 1340.52 కోట్లు	నరసన్నపేట	రూ. 500కోట్లు
శ్రీకాకుళం	రూ. 1534.15 కోట్లు	శ్రీకాకుళం	రూ.500కోట్లు
టెక్కలి	రూ. 1507.06 కోట్లు	టెక్కలి	రూ. 400కోట్లు
పలాస	రూ. 1301.72 కోట్లు	పలాస	రూ. 600కోట్లు
ఇచ్ఛాపురం	రూ. 1590.05 కోట్లు	ఇచ్ఛాపురం	రూ. 727కోట్లు
ఎచ్చెర్ల	రూ. 1669.93 కోట్లు	ఎచ్చెర్ల	రూ. 369.35 కోట్లు
పాతపట్నం	రూ. 1307.40 కోట్లు	పాతపట్నం	రూ. 820కోట్లు

• మనబడి నాడు-నేడు



నాడు-నేడుతో సుందరంగా తీర్చిదిద్దిన ఇచ్ఛాపురంలోని కండ్రవీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల

- **ఫేజ్-1:** జిల్లాలో నాడు-నేడు మొదటి ఫేజ్ కింద 1247 పాఠశాలను సుందరంగా తీర్చిదిద్ది మౌలిక సదుపాయాలు కల్పించారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.286.22 కోట్లు వెచ్చించింది.
- **ఫేజ్-2:** జిల్లాలో నాడు-నేడు రెండో ఫేజ్ కింద పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాలు.. ఇలా 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్దారు. అదనపు తరగతి గదులను నిర్మించి, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇందు కోసం రూ.427.73 కోట్లు కేటాయించారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి.

• వ్యవ'సాయం'



- జిల్లాలో రైతుల కోసం 642 రైతుభరోసా కేంద్రాలు నిర్మించారు. 7 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ల నిర్మాణాలు చేపట్టారు. వైఎస్సార్ రైతుభరోసా కింద 3.21 లక్షల మంది రైతులకు రూ 1919.46 కోట్లు అందించారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 87,158 రైతులకు గాను రూ 85.14 కోట్లు అందజేశారు.
- రూ.424.74కోట్లతో 2,89,197 క్వింటాళ్ల విత్తనాలను (వరి,మినుములుతో పాటు ఇతరాలు) సబ్సిడీ ధరపై అందించారు. 82,745 మెట్రిక్ టన్నులు ఎరువులు (యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే) పురుగు మందులు 5592 లీటర్లు నేనో, యూరియా వంటివి ఆర్‌బీకేల ద్వారా అందించారు.
- సాగుకు ఉపయోగపడేలా వైఎస్సార్ యంత్రసేవా పరికరాలు అందజేశారు. చిన్న, సన్నకార రైతులకు 505 ట్రాక్టర్లు, మల్టిపుల్‌క్రాప్ ట్రెసర్స్, పాడిరేపర్స్, రోటావెటర్స్, 57 క్లస్టర్లలో వరి కంబైన్డ్ హార్వెస్టర్స్ వంటివి అందించారు. 10 వేల భూసార పరీక్షలు చేశారు. 27,049 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఇవన్నీ చేయడంతో సాగుతో పాటు పంట దిగుబడి గణనీయంగా పెరిగింది.

క్లుప్తంగా

ఆయన నేత్రాలు సజీవం


శ్రీనివాసరావు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ–బి కాలనీలో నివాసముంటున్న గుడ్ల శ్రీనివాసరావు(80) గుండెపోటుతో మృతి చెందారు. మరణానంతరం కూడా మరో ఇద్దరికి చూపునివ్వాలని ఆలోచనతో వారి కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా శ్రీనివాసరావు కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వి.ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి పంపించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను చైర్మన్ అభినందించారు. ఎవరైనా నేత్రదానం చేయాలనుకుంటే 78426 99321 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

నేడు జానపద కళాజాతర


ఏర్పాట్లు పరిశీలిస్తున్న కళాకారులు

పలాస: ఏటా సంప్రదాయబద్ధంగా జరగనున్న సిక్కోలు జాన పద కళాజాతరకు పలాస మండలం గురుదాసుపురం సిద్ధమైంది. గురువారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సుమారు 5వేలు మంది కళాకారులు, కళాభిమానులతో ఇక్కడి ప్రాంగణం కళకళలాడనుంది. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కళాజాతర నిర్వహిస్తున్నామని చెప్పారు. కలెక్టరు శ్రీకేష్ బి.లాఠకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రముఖ కళాకారులు హాజరవుతున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రచార కార్యదర్శి కుత్తుం వినోద్ కోరారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టెక్కలి వైద్యుడు


నంబాళ్ల విద్యాసాగర్

టెక్కలి: ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టెక్కలికి చెందిన హోమియోపతి వైద్యుడు నంబాళ్ల విద్యాసాగర్‌కు స్థానం లభించింది. ఈ నెల 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం, జిగ్నాష సంస్థ నిర్వహించిన యువ–2024 కార్యక్రమంలో భాగంగా టెక్కలికి చెందిన హోమియో వైద్యుడు విద్యాసాగర్ పాల్గొని 'ఫుడ్ యాజ్ మెడిషిన్ ఏ హోమియోపతిక్ పెర్స్పెక్టివ్'అనే అంశంపై ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల నుంచి యోగా నిపుణులు, ఆయుర్వేదిక్ నిపుణులు హాజరైన ఈ కార్యక్రమంలో ' మైండ్ ఫుల్ మార్నింగ్'లో నిర్వహించిన ప్రసంగంలో విద్యాసాగర్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ మేరకు బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు.

అపురూపం.. వాసుదేవుని దివ్యరూపం



మందస: ధనుర్మాస ప్రతపూజలు అందుకుంటున్న మందస వాసుదేవుడు బుధవారం దివ్య రూపంతో సాక్షాత్కరించాడు. స్వామివారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం కావడంతో స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్తరద్వార దర్శనం కల్పించారు. సంక్రాంతి రోజులు కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


నరసన్నపేటలో వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆడుదాం ఆంధ్రా రెండో దశ పోరు మొదలైంది. బుధవారం మండల స్థాయి పోటీలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ఈనెల 23వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 30 మండలాల పరిధిలోని 732 సచివాలయాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్(డబుల్స్) క్రీడాంశాల్లో ఎంపిక చేసిన జట్లు తలపడుతున్నాయి. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు, ఇతర అధికారులు, కోచ్‌లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాకుళం అర్బన్ పరిధికి సంబంధించి కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో హోరాహోరీగా పోటీలు కొనసాగాయి.

తండ్రీ కొడుకుల డబుల్ గేమ్

- కలిశెట్టికి చంద్రబాబు, కళాకు లోకేష్ ప్రోత్సాహం
- అధిష్టానం ఆటలో పావులుగా మారుతున్న కార్యకర్తలు
- బొబ్బిలి సభతో మరోసారి తెరపైకి విభేదాలు
- ఎచ్చెర్ల టీడీపీలో రచ్చ


బొబ్బిలిలో చంద్రబాబు నిర్వహించిన సభా వేదికపైకి ఆహ్వానించడంతో కూర్చొన్న కలిశెట్టి


కలిశెట్టిని పార్టీ నుంచి బహిష్కరించినట్టు ఆ మధ్య జారీ చేసిన ప్రకటన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రెండుగా చీలిపోయిన ఎచ్చెర్ల టీడీపీ నేతలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. టికెట్ పోరులో తాడోపేడో తేల్చుకోవడానికి ప్రధాన ఆశావహులు సిద్ధమయ్యారు. వీరితో అధిష్టానం కూడా డబుల్ గేమ్ ఆడుతోంది. ఎవరికి టికెట్ ఇచ్చి ముందుకు తీసుకెళ్తుందో, ఎవర్ని బలి పశువు చేస్తుందో తెలియదు గాని వీరి మధ్య తీవ్రస్థాయిలో వ్యక్తిగత యుద్ధం నడుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఒకర్ని ప్రోత్సహిస్తుంటే, ఆయన కుమారుడు లోకేష్ మరొకర్ని ప్రోత్సహిస్తున్నారు. బయటికొకటి, లోపలొకటి చెప్పి గ్రూపులు కట్టిన నాయకులు, కార్యకర్తలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నారు. ఈరోజుకు కాకపోయినా రేపైనా అక్కడొక గ్రూపు రోడ్డెక్కి పార్టీపై తిరుగుబావుటా ఎగురవేసే అవకాశం కనిపిస్తోంది.

పోటీలో నిలిచేది నేనే..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రధానంగా ఇద్దరు నాయకుల మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. అందులో ఒకరు కళా వెంకటరావు, మరొకరు కలిశెట్టి అప్పలనాయుడు. వీరిలో అప్పుడప్పుడు నియోజకవర్గంలోకి వచ్చి తానున్నానంటూ కళా వెంకటరావు హడావుడి చేస్తుండగా, స్థానికంగా ఉంటూ టీడీపీ కేడర్‌కు కలిశెట్టి అప్పలనాయుడు అండగా నిలుస్తున్నారు. చేతిడబ్బులు వదిలించుకుని అప్పలనాయుడు రాజకీయం చేస్తుండగా, తన మాటకారితనంతో కళా వెంకటరావు నియోజకవర్గంలో షో చేస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీలో ఉన్న అరకొర కార్యకర్తలు, నాయకులు ఎక్కువగా కలిశెట్టి వైపు మొజు చూపిస్తున్నారు. తానీసారి ఎలాగైనా పోటీ చేస్తానంటూ పట్టుబడుతూ ముందుకు సాగుతున్నారు. కలిశెట్టికి అంత సీన్ లేదని, అధిష్టానం తన మాటే వింటుందని, రానున్న ఎన్నికల్లో పోటీ చేసేది తానేనని కళా వెంకటరావు చెప్పుకుని తిరుగుతున్నారు. ఇద్దరి మధ్య పోరు తీవ్రస్థాయిలో నడుస్తోంది. ఉన్న కార్యకర్తలు కూడా రెండుగా చీలిపోయి బాహాటంగానే దుమ్మెత్తిపోసుకుంటున్నారు. వీరి మధ్య సోషల్ మీడియా వార్ గట్టిగా జరుగుతోంది. ఈ క్రమంలో అధిష్టానం వద్ద ఉన్న పలుకుబడో, తన రాజకీయ ఆధిపత్యమో తెలియదు గాని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ, వ్యక్తిగత అజెండాతో నడుస్తున్నారంటూ కలిశెట్టి అప్పలనాయుడును పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు ఆ మధ్య కళా వెంకటరావుతో పాటు విజయనగరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున స్వయంగా ప్రకటించడమే కాకుండా తన లెటర్ హెడ్‌తో ప్రకటన కూడా విడుదల చేశారు.

సస్పెన్షన్ బేఖాతర్..

అధిష్టానం పేరు చెప్పి జిల్లా పార్టీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, నియోజకవర్గ ఇన్‌చార్జి కళా వెంకటరావు ఒక్కటై కలిశెట్టి అప్పలనాయుడిని పార్టీ నుంచి బహిష్కరించినట్టు ప్రకటించినా లెక్క చేయలేదు. తాను యధావిధిగా పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికంతటికీ పార్టీ అధిష్టానం నడుస్తున్న డబుల్‌గేమ్ అని స్పష్టంగా అందరికీ తెలిసిందే. లోకేష్ అనుచరుడిగా కళా వెంకటరావు పెత్తనం చెలాయిస్తూ కలిశెట్టిని తొక్కేయడానికి ప్రయత్నించగా, చంద్రబాబు వత్తాసుతో కలిశెట్టి అప్పలనాయుడు పార్టీలో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున ప్రకటించిన బహిష్కరణ ఉత్తుత్తేదేనని, పార్టీలో అవకాశవాద రాజకీయాలు సాధారణమేనని టీడీపీ చెప్పకనే చెప్పింది.

బొబ్బిలి వేదికగా ఆసక్తికర పోరు

తాజాగా బుధవారం విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగిన చంద్రబాబు సభపై ఎచ్చెర్ల టీడీపీలో ఉత్కంఠ నడిచింది. ఈ సభ వేదికపైకి కలిశెట్టి అప్పలనాయుడును ఎట్టి పరిస్థితుల్లో ఆహ్వానించకూడదని, వేదికపైకి రానివ్వకూడదని కళా వెంకటరావు తీవ్రంగా ప్రయత్నించారు. తన మాటే శాసనమని, కలిశెట్టి పప్పులుడకవని కేడర్‌కు సంకేతాలు ఇచ్చారు. కానీ, అనూహ్యంగా కళా ఆలోచనకు భిన్నంగా కలిశెట్టిని వేదికపైకి ఆహ్వానించడమే కాకుండా తనకొక సీటు వేసి కూర్చోబెట్టారు. ఏదో అనుకుంటే ఇంకేదో అయిందని కళా అండ్‌కో ముఖాలు వాడిపోయాయి. తనను తొక్కేద్దామని చూస్తే దానికి దీటుగా రిప్లయ్ ఇస్తామన్నట్టుగా కలిశెట్టి అండ్‌కో సెటైర్లు వేస్తోంది. ఎచ్చెర్ల టీడీపీలో ఇప్పుడిదే చర్చ జరుగుతోంది. తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ ఆడుతున్న డ్రామాలో భాగంగానే ఇక్కడిలా జరుగుతోందని, టిక్కెట్ ఖరారు సమయం వచ్చినప్పుడు ఒకరు బయటకు వెళ్లక తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మృత్యువులోనూ వీడని బంధం

- నూర్పిడి యంత్రం బోల్తాపడి దంపతుల మృతి
- బిన్నళమదనాపురంలో విషాదం


భుజంగరావు, భానుమతి దంపతుల మృతదేహాలు

మందస : ఆరుగాలం శ్రమించిన పండిన పంటను ఇక ఇంటికి తీసుకెళ్లడమే మిగిలి ఉందని భావించిన ఆ దంపతులిద్దరికీ నూర్పు యంత్రం మృత్యువు రూపంలో వెంటాడింది. అప్పటి వరకు తమ కళ్ల ముందే ఉన్న భార్యాభర్తలు రెప్పపాటులో మరణించడం గ్రామస్తులను దిగ్భ్రాంతికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలం బిన్నళమదనాపురం గ్రామానికి చెందిన మార్పు భుజంగరావు(63), భానుమతి(52) దంపతులు. ఖరీఫ్‌లో పండిన వరి పంటను నూర్పు యంత్రంతో నూర్పు చేస్తున్నారు. ఒకచోట సక్రమంగానే నూర్పు చేసి దగ్గర్లోని మరో కుప్ప వద్దకు యంత్రాన్ని తీసుకెళ్తుండగా.. గట్లు ఉండటంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం కింద పడి భుజంగరావు, భానుమతి అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. భుజంగరావు, భానుమతిలకు కుమారుడు ప్రసాద్, కుమార్తె లావణ్య ఉన్నారు. దంపతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మందస ఎస్‌ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిట్ కాయిన్స్ ట్రేడింగ్ పేరిట రూ.16 లక్షలకు టోకరా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంగా మరో సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. బిట్ కాయిన్స్ ట్రేడింగ్ టాస్కుల పేరిట ఆమదాలవలస మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ యువకుడి నుంచి రూ.16,16,106 దోచుకున్నారు. బాధితుడు ఈ నెల 9న ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ కృష్ణ, బాధితుడు చెప్పిన వివరాల మేరకు.. ఆమదాలవలసకు చెందిన యువకుడు అహ్మదాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఏడాదిన్నరగా ఇంటి వద్ద నుంచే గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతూ విధులు నిర్వర్తిస్తున్నాడు. గతేడాది డిసెంబరు 30న టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన వీడియోలకు రివ్యూ(లైక్) ఇవ్వడంతో రూ.50 తన ఖాతాలోకి జమ చేశారు. మూడు టాస్కులు చేయడంతో పేటీఎం పేమెంట్ ద్వారా రూ.150 పంపించారు. అలా యువకుడిని నమ్మించిన ముఠా బిట్‌కాయిన్ బీసీఎక్స్ గ్రూప్ పేరిట వాట్సాప్ ద్వారా రంగంలోకి దిగారు. పది టాస్కులు వరకు డబ్బులు వేస్తూ యువకున్ని నమ్మబలికించారు. ఆ తర్వాత దశల వారీగా యువకుడి నుంచి రూ.16.16 లక్షలు నెట్‌బ్యాంకింగ్ ద్వారా దోచుకుని తిరిగి ఇవ్వలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930 సైబర్‌సెల్‌కు ఫిర్యాదు చేశాడు. ఆమదాలవలస ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం కొట్టేశారు..పోలీసులు పట్టేశారు!

- సపర్యలు చేసినట్టు నటిస్తూ బంగారంతో ఉడాయించిన యువకులు
- రెండు గంటల్లోనే పట్టుకున్న పోలీసులు


కర్రి అమ్మన్న

హిరమండలం: మండల కేంద్రం హిరమండలంలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. అపస్మారక స్థితిలో పడిపోయిన మహిళను రక్షిస్తున్నట్టు నటించి ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను ఇద్దరు యువకులు తెంచుకుపోయారు. సీసీ పుటేజీలకు చిక్కడంతో పోలీసులు నిందితులను రెండు గంటల్లోనే పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భామిని మండలం నులకజోడుకు చెందిన కర్రి అమ్మన్న అనే మహిళ పాతపట్నం మండలం కొరసవాడ వెళ్లింది. అక్కడ కుమార్తెను పండుగ పిలుపు చేసుకొని తిరుగుముఖం పట్టింది. సుభలయి బ్యారేజీ సెంటర్‌కు చేరుకుని పక్కనే బహిర్భూమికి వెళ్లింది. అనారోగ్యానికి గురై అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పుడే ఇద్దరు యువకులు ఆమెకు సపర్యలు చేస్తున్నట్టు నటించారు. మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. కొద్దిసేపటికే మెలకువ రావడంతో అమ్మన్న ఒక్కసారిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల ఉన్నవారు ఆరాతీశారు. తన ఆభరణాలు దోచుకుపోయారని చెప్పి లబోదిబోమంది. వెంటనే హిరమండలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. కేసు నమోదుచేసిన పోలీసులు రంగంలోకి దిగారు. సుబలాయి జంక్షన్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఇద్దరు యువకుల ఆనవాళ్లను గుర్తించారు. వారు స్థానిక మోణంగి వీధికి చెందిన ఐ.సురేష్, సిహెచ్.మాధవరావులుగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించేసరికి వారు నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐ నారాయణస్వామి తెలిపారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

అరసవల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో మంగళవారం 17 మండలాల్లో గ్రామ సచివాలయాల్లో 4438 మంది, బుధవారం పట్టణ ప్రాంతాల్లో 5 వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 1602 మంది ఉచిత వైద్య సేవలు పొందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరాలు నిర్వహించారు. ఏడు రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా 172 రకాల మందులను పంపిణీ చేశారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్, ఆప్తాలమిక్ వైద్యునితో కలిసిన బృందం ఆధ్వర్యంలో బిపి, షుగర్, హిమోగ్లోబిన్, టి.బి, మలేరియా వంటి పరీక్షలు నిర్వహించారు.

అర్ధరాత్రి దొంగలు పడ్డారు..!

- శ్రీకాకుళం మండల వీధిలో బంగారం చోరీ
- పరిశీలించిన క్లూస్ టీం


ఘటనాస్థలిలో సీఐ, ఎస్‌ఐలు సన్యాసినాయుడు, గణేష్‌లు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఓ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పడి ఎనిమిదిముప్పావు తులాల బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. సంక్రాంతి సెలవులకని ఇంట్లో తాళం వేసి సొంత గ్రామానికి వెళ్లడంతో అదును చూసి చోరీ చేశారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలికి చెందిన గొర్లె రమాదేవి భర్త భాస్కర్ అసోంలోని సీఆర్పీఎఫ్‌లో పనిచేస్తుండటంతో తన ఇద్దరు పిల్లల చదువుల నిమిత్తం శ్రీకాకుళం మండలవీధిలో మూడంతస్తుల బిల్డింగ్ క్రింద ఫ్లోర్‌లో అద్దెకుంటోంది. ఈ నెల 9న ఉదయం 11 గంటల సమయంలో పిల్లలతో కలిసి రమాదేవి సొంతగ్రామం సరుబుజ్జిలికి పయనమైంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం రమాదేవి ఇంటికి పాలవాడు వచ్చి గేట్లు తెరిచివుండటం చూసి కేక వేయగా ఎవరూ రాకపోవడంతో పైనున్న ఇంటి ఓనరుకు చెప్పాడు. కిందకి దిగి చూడగా తలుపులు తెరిచి ఉండటం చూసి లోపలకు వెళ్లాడు. బీరువా లాకర్ పగులగొట్టి వస్తువులు చెల్లాచెదురుగా ఉండటం చూసి చోరీకి గురైందని గ్రహించి వెంటనే రమాదేవికి ఫోన్‌లో సమాచారం అందించి, పోలీసులకు విషయాన్ని చేరవేశారు. ఈలోగా సీఐ లెంక సన్యాసినాయుడు, ఎస్‌ఐ గణేష్, సీసీఎస్ టీమ్, క్లూస్ టీమ్‌లు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే చేరుకున్న రమాదేవి బీరువాలో బంగారు ఆభరణాలు లేకపోవడం చూసి ఉలిక్కిపడింది. టౌన్ డీఎస్పీ యర్రగుంట శృతి ఇంటి పరిసరాలను పరిశీలించి బాధితురాలి వద్ద వివరాలు సేకరించారు. చోరీకి గురైన వాటిలో నెక్లెస్, నల్లపూసలు, బ్రాస్‌లెట్, రెండు ఉంగరాలు, రెండు గొలుసులు ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేష్ పేర్కొన్నారు.

బంగారం, నగదు అప్పగింత


పర్సును అందజేస్తున్న ఉపాధ్యాయుడు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఏడురోడ్ల కూడలిలో బంగారం, నగదు, వెండి ఉన్న పర్సును మహిళకు బుధవారం అప్పగించినట్లు రెండో పట్టణ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు పేర్కొన్నారు. పొందూరు మండలం నందివాడకు చెందిన పిన్నింటి లక్ష్మి మంగళవారం నగరానికి వచ్చింది. ఈ క్రమంలో తన పర్సు పోగొట్టుకుంది. నగరంలోని మున్సిపల్ స్కూల్ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావుకు పర్సు దొరకడంతో మంగళవారం రెండో పట్టణ పోలీసులకు అందించారు. పర్సు తెరిచి చూసేసరికి అరతులం బంగారు చెవిరింగులు, వెండి ఉంగరం, రూ. 2,430 నగదు ఉండటంతో అందులో ఉన్న స్లిప్పులు ఆధారంగా పిన్నింటి లక్ష్మివని గుర్తించి కబురుపెట్టారు. బుధవారం ఆమె రావడంతో ఎస్‌ఐ లక్ష్మణరావు సమక్షంలో ఉపాధ్యాయుడు ఆమెకు పర్సు ఇచ్చారు. ఉపాధ్యాయున్ని పోలీసులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

శ్రీకాకుళం: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, నగర పాలక సంస్థలోని పారిశుద్ధ్య కార్మికులు సమ్మెను వాయిదా వేశారు. బుధవారం కార్మిక సంఘాలతో రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపాల్ అధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘ నేతలు ప్రకటించారు. డిసెంబర్ 26 నుంచి సమ్మె చేపట్టారు. ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు సమ్మె కాలానికి జీతం ఇవ్వడం, సమ్మె కాలంలో నమోదు చేసిన కేసులు ఎత్తివేయడం, రూ.21వేల వేతనం, పండుగకు కొత్త దుస్తులకు రూ.వెయ్యి, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 7లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. వీటితో పాటు మరికొన్ని డిమాండ్లకు పరిష్కారం చూపడంతో పారిశుద్ధ్య కార్మికులు సమ్మెను వాయిదా వేశారు. గురువారం నుంచి కార్మికులు యథావిధిగా విధులకు హాజరవుతారు.

హోరాహోరీగా టెన్నికాయిట్ పోటీలు


తలపడుతున్న క్రీడాకారులు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో 47వ సీనియర్ నేషనల్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పలాస వేదికగా జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు, నిర్వాహకులు పట్ట తవిటయ్య ఆధ్వర్యంలో రెండో రోజు పోటీల్లో హర్యానా జట్టుపై ఒడిశా జట్టు 3-0 పాయింట్లతో, ఢిల్లీ జట్టుపై మహారాష్ట్ర జట్టు 3-0, మధ్యప్రదేశ్ జట్టుపై తెలంగాణ జట్టు 3-0, ఛత్తీస్‌గఢ్ జట్టుపై పాండిచ్చేరి జట్టు 3-1, గుజరాత్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ జట్టు 3-0, అస్సాం జట్టుపై జార్ఖండ్ జట్టు, జమ్మూ కాశ్మీర్ జట్టుపై తమిళనాడు జట్టు 3-0తో విజయం సాధించాయి.

పోలీసులకు చిక్కిన జేబుదొంగ

శ్రీకాకుళం క్రైమ్ : అరసవిల్లి సూర్యనారాయణ సన్నిధిలో భక్తుల జేబులకు కన్నాలు వేసే ఓ జేబుదొంగ ఒకటో పట్టణ పోలీసులకు బుధవారం చిక్కాడు. ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలసకు చెందిన పూజారి శ్రీను అరసవిల్లి సూర్యనారాయణున్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులే లక్ష్యంగా పర్సులు, మొబైల్ ఫోన్లు చోరీ చేస్తుండేవాడు. ఇదేవిధంగా ఇటీవల ఓ భక్తుని జేబులో పర్సు తీస్తుండటం సీసీ కెమెరా పుటేజీలో నిక్షిప్తమవ్వడంతో పోలీసులు గమనించి శ్రీనుగా గుర్తించారు. ఆలయ ఉద్యోగులను విచారించి బుధవారం అరసవిల్లి ప్రాంతంలోనే శ్రీనును పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

• సంక్రాంతి సందడి


గంగిరెద్దుతో హరిదాసు


ఎచ్చెర్లలోని వేంకటేశ్వరా ఇంజనీరింగ్ కాలేజీలో నాటు బళ్ల ప్రదర్శన


శ్రీకాకుళం మెహర్ విద్యావిహార్‌లో సంక్రాంతి వేడుకలు


శ్రీకాకుళంలోని జాయ్‌కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు


అరసవల్లిలోని ఆదిత్యా అర్బన్ అకాడమీ వద్ద హరిదాసు అలంకరణలో చిన్నారి

ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. పండగ సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యాసంస్థల వద్ద ముత్యాల ముగ్గులు, భోగి మంటలు, గంగిరెద్దు, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ సందర్భంగా పండగ ఔన్నత్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు.

– శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల క్యాంపస్